కామారెడ్డిలోని శారదాదేవీ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

రేపటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

కామారెడ్డి, అక్టోబర్ 13 : జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న శారదాదేవీ ఆదిశంకర ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కారంగుల మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. వేద పండితులు, రుత్విక్కుల ఆధ్వర్యంలో శారదాదేవీ ఆలయంలో ఈ నెల 15నుంచి 23వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ సుహాసినులతో నవదుర్గ వ్రతంతోపాటు అమ్మవారికి విశేష పూజలు, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు ఏనుగుల పెంటయ్య, శివకుమార్, ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి..

బాన్సువాడలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ధర్మకర్త శంభురెడ్డి

బాన్సువాడ టౌన్, అక్టోబర్ 13 : పట్టణంలోని శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పరిగె శంభురెడ్డి తెలిపారు. వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పూజారి సంతోష్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

కురుమ యువ చైతన్య సమితి నూతన కార్యవర్గం ఎన్నిక

నియామక పత్రాలను అందజేస్తున్న జిల్లా ప్రతినిధులు

భిక్కనూరు, అక్టోబర్ 13: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో కురుమ యువ చైతన్య సమితి నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు మామిడి సంజీవ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా చెట్కూరి భూపాల్, ఉపాధ్యక్షుడిగా ఎర్రోళ్ల మహిపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చెట్కూరి మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా దొడ్లె కొమురయ్య, కోశాధికారిగా ఎర్రోళ్ల మల్లేశ్, ప్రచార కార్యదర్శిగా వంకాయల హరీశ్‌ను నియమించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దోళ్ల మహేశ్, ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల స్వామి, జిల్లా ప్రచార కార్యదర్శి రవికుమార్, కడబోయిన సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా స్పోర్ట్స్‌మీట్

జోనల్‌స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 13 :మండలంలోని బోర్లం క్యాంపు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 9వ జోనల్‌స్థాయి స్పోర్ట్స్‌మీట్ -2023 పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను స్థానిక ప్రిన్సిపాల్ పద్మకు మారితో కలిసి గురుకులాల రాష్ట్ర అధికారి భానుప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు.

1275 మంది క్రీడాకారులు..

స్పోర్ట్స్ మీట్‌లో 3వ జోన్ పరిధిలోని కామారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు చెందిన 1275 మంది విద్యార్థినులు పాల్గొంటున్నారు. అండర్- 14, 17, 19 విభాగాల్లో గేమ్స్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తుండగా, ఈ నెల 16వ తేదీ వరకు స్పోర్ట్స్ మీట్ కొనసాగుతుందని ప్రిన్సిపాల్ పద్మ కుమారి తెలిపారు. జిల్లా కో-ఆర్డినేటర్ కృతామూర్తి, వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి, కామారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు చెందిన గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న కొయ్యగుట్ట, సిద్దిపేట జట్లు

కబడ్డీ పోటీల్లో తలపడుతున్న బోర్లం, సిద్దిపేట జట్లు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న టీఎస్ ఆర్‌డీసీ ఓఎస్డీ భానుప్రసాద్

క్యాన్సర్‌పై నర్సింగ్ విద్యార్థులకు అవగాహన

అవగాహన కల్పిస్తున్న బాన్సువాడ దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్

బాన్సువాడ, అక్టోబర్ 13 : బాన్సువాడ మాతాశిశు దవాఖానలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినులకు వివిధ రకాల క్యాన్సర్లపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ.. క్యాన్సర్ కారకాలు, లక్షణాలను ముందుగా వివరించారు. ధూమపానం, మద్యపానంతోపాటు వాయు కాలుష్యంతోనూ క్యాన్సర్లు వస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ దురలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం బ్రెస్ట్ క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు దవాఖానలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణవేణి, హెడ్‌నర్స్ ఆరోగ్య లక్ష్మి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హన్సులీ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 13: మండలంలోని బోర్లం, బోర్లం క్యాంపు తండా గ్రామస్తులు గ్రామ దేవతల పండుగను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాజా భజంత్రీల నడుమ గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. ఏటా పంటలు చేతికందే సమయంలో గ్రామ దేవతలకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తున్నదని గ్రామ పెద్దలు తెలిపారు.

ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

నేడు జిల్లాస్థాయి ఆర్చరీ ఎంపిక పోటీలు

దోమకొండ, అక్టోబర్ 12: మండలకేంద్రంలోని గడీకోటలో నేడు (శనివారం) జిల్లాస్థాయి ఆర్చరీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి, కోచ్ ప్రతాప్‌దాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని, ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఉదయం 8గంటలలోపు నాలుగు ఫొటోలు, ఆధార్, బోనాఫైడ్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు

బీబీపేట్, అక్టోబర్ 13: మండలంలోని జనగామ గ్రామానికి చెందిన విభూతి దుర్గయ్య ఆనారోగ్యంతో మృతిచెందాడు. ఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఎల్లం, ఎస్ఎంసీ చైర్మన్ సాయికుమార్, గ్రామ అధ్యక్షుడు సిద్దరాంరెడ్డి, ఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు శేఖర్, రాజు, రవి, ఆనంద్, గౌస్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

మెగావత్ జ్యోతి

రామారెడ్డి, అక్టోబర్ 13: మండలంలోని గోకుల్‌తండా గ్రామానికి చెందిన మెగావత్ జ్యోతి అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. జ్యోతి గురువారం రాత్రి చీరలకు ఫాల్స్ కుట్టిస్తానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లినట్లు చెప్పారు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో చుట్టూ పక్కల, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త సుభాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నిజాంసాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

పంటలకు కొనసాగుతున్న నీటి విడుదల

నిజాంసాగర్, అక్టోబర్13: నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కింద సాగవుతున్న పంటల కోసం ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల కొనసాగుతున్నట్లు ఏఈ శివకుమార్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు (17.80 టీఎంసీలు) కాగా.. శుక్రవారం సాయంత్రానికి 1404.78 అడుగుల (17.48 టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నదని పేర్కొన్నారు. ఎగువప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నదని తెలిపారు. ఆయకట్టు కింద ఆలస్యంగా సాగుచేసిన వరి పంటలకు ప్రస్తుతం ఒక్కతడి నీరు అవసరం ఉండగా, ప్రధాన కాలువ ద్వారా 1688 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు.